క్లుప్తంగా

8న ఉచిత కంటి వైద్య శిబిరం

పెడన: సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు ఉస్మాన్‌బాషా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. పెడన గుడి వాడ రోడ్డులోని షాదీఖానాలో జరిగే శిబిరానికి ఏలూరు ఆశ్రమ్ ఆస్పత్రి నుంచి వైద్యులు వస్తారన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే ఈ శిబిరంలో ఉచితంగా కంటి పరీక్షలు చేయడంతో పాటు అవసరమైన వారికి ఆశ్రమ్ ఆస్పత్రికి తీసుకువెళ్లి ఉచితంగా శస్త్రచికిత్సలు కూడా చేస్తారని పేర్కొన్నారు. వాహనాన్ని మన ఊర్లో పెట్టి వారే ఆపరేషన్ చేయించి తీసుకుని మరలా మన ఊర్లో దింపుతారని, భోజనం కూడా ఏర్పాటు చేస్తారని తెలిపారు. ఆపరేషన్ చేయించిన తర్వాత రెస్ట్ తీసుకునే సమయంలో కొంత ఆర్థిక సహాయం కూడా చేస్తారని, కళ్లజోళ్లు కావలసిన వారికి కేవలం రూ.300 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 7013781789, 9866613913లలో సంప్రదించాల్సిందిగా పేర్కొన్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

కోడూరు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని సోమవారం స్థానిక కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుధాప్రవీణ్ ఆదివారం తెలిపారు. ఎంపీపీ కొండవీటి వెంకట కుమారి అధ్యక్షతన మధ్యాహ్నం 2గంటలకు జరిగే ఈ సమావేశాన్ని అన్ని శాఖల అధికారులు విధిగా హాజరు కావాలన్నారు. ఎంపీటీసీలు, సర్పంచులు సమావేశంలో పాల్గొని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని ఎంపీడీఓ కోరారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం



చల్లపల్లి(అవనిగడ్డ): రెండు కిడ్నీలు దెబ్బతిని చికిత్స పొందుతున్న చల్లపల్లి నారాయణరావు నగర్‌కు చెందిన సుభానీకి రావెళ్ల ఫౌండేషన్ చైర్మన్ రావెళ్ల ఉదయ్‌కిరణ్ రూ.25వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ మొత్తాన్ని సుభానీ కుటుంబ సభ్యులకు ఫౌండేషన్ సభ్యులు పరుచూరి సురేష్ బాబు, మోర్ల శివ అందించారు. నిడమానూరి శ్రీకాంత్, కొల్లి హర్ష, ఉరిమి విశ్వనాథ్ పాల్గొన్నారు. విశాఖపట్నంలో క్యాన్సర్‌తో బాధపడుతున్న భాగ్యలక్ష్మికి రూ.10వేలు సహాయాన్ని ఫౌండేషన్ సభ్యుడు నరసింహారావు అందించారు.

220 మందికి వైద్యసేవలు



మచిలీపట్నంటౌన్: స్థానిక బుట్టాయిపేటలోని జ్యోతిరావుపూలే విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జీబీఆర్ ఫౌండేషన్, ప్రజారోగ్య వేదికల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ గోపాలం శివన్నారాయణ నేతృత్వంలో వైద్యబృందం రోగులకు వైద్యసేవలు అందించారు. పక్షవాతం, బీపీ, సుగర్, మూర్ఛ తదితర రోగాలతో బాధపడే వారికి వైద్యపరీక్షలతో పాటు రూ. 200కే నెలకు సరిపడా మందులను అందజేశారు. మొత్తం 220 మంది వైద్యపరీక్షలు పొందారు. ఈ శిబిరంలో వైద్యులు డీఆర్కే ప్రసాద్, పి. సురేష్‌చంద్రారెడ్డి, కుప్పా రామశాస్త్రి, శంకరానంద్ రోగులకు పరీక్షలు నిర్వహించారు. వైద్యశిబిరాన్ని శిబిర కన్వీనర్ పామర్తి నాగయ్య పర్యవేక్షించారు.

మాజీ జెడ్పీటీసీ గోఖలే మృతి



గూడూరు: టీడీపీ సీనియర్ నాయకుడు గూడూరు మాజీ జెడ్పీటీసీ సభ్యుడు చిలుకోటి గోపాలకృష్ణ గోఖలే(78) ఆదివారం మృతి చెందారు. 2014–19 మధ్యకాలంలో ఆయన గూడూరు జెడ్పీటీసీగా పనిచేశారు. ఎస్సీ సామాజిక వర్గంలో బలమైన నేతగా గుర్తింపు పొందిన గోఖలే తన వాగ్ధాటితో ఆకట్టుకునేలా ప్రసంగాలు చేసేవారు. బెజవాడ కనకదుర్గమ్మ ఆలయ ట్రస్ట్‌బోర్డు డైరెక్టర్‌గా కూడా పనిచేశారు. గోఖలే భార్య సుజాత కొద్దిరోజుల క్రితం మృతి చెందగా ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

10 ఎకరాల గడ్డి వామి దగ్ధం



ఘంటసాల: విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన అగ్ని ప్రమాదంలో 10 ఎకరాల గడ్డి వామి దగ్ధమైన సంఘటన మండల కేంద్రమైన ఘంటసాల గోటకంలో ఆదివారం చోటు చేసుకుంది. అవనిగడ్డ ఫైర్ స్టేషన్ ఇన్‌చార్జి ఎస్ఎఫ్ఓ బి.బాల మురళీ కృష్ణ అందించిన వివరాల మేరకు గోటకం మసీదు దగ్గరలోని గాజుల శివ వెంకటేశ్వరరావుకు చెందిన 10 ఎకరాల గడ్డివామికు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించిందన్నారు. స్థానికులు మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నం చేయడంతో పాటు ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న అవనిగడ్డ ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేయడంతో పాటు ఒక పూరిల్లు, పక్కనే మరో గడ్డివామికి మంటలు అంటకుండా కాపాడారు.

ధూళి మయం.. గుంతల భయం!

- దారుణంగా కోడూరు–అవనిగడ్డ రహదారి
- రోడ్డుపై వెళ్లేందుకు హడలిపోతున్న వాహనచోదకులు
- సగం పూర్తయిన పనులను కూటమి ప్రభుత్వం నిలిపివేయడంతో పాట్లు



దుమ్ము, ధూళితో వాహనచోదకుడి కష్టాలు

కోడూరు: కోడూరు–అవనిగడ్డ ప్రధాన రహదారిపై ప్రయాణించేందుకు వాహనచోదకులు హడలిపోతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఈ రహదారి నిర్మాణానికి రూ.16.80కోట్లు కేటాయించి, 50శాతానికి పైగా నిర్మాణ పనులను పూర్తి చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రహదారి నిర్మాణాన్ని వదిలివేయడంతో ప్రస్తుతం ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. కృష్ణాపురం, జయపురం, వి.కొత్తపాలెం, మాచవరం ప్రాంతాల్లో రహదారిపై కేవలం వెట్‌మిక్స్ మాత్రమే వేసి వదిలేశారు. వాటరింగ్ కూడా లేకపోవడంతో దుమ్ము, ధూళి తీవ్రత అధికంగా ఉంది. భారీ వాహనాలు వెళ్లినప్పుడు వాటి వెనుక భాగంలో భారీగా దుమ్ము, ధూళి లేకపోవడంతో వాహనదారులు రహదారి వెంట వెళ్లలేని పరిస్థితి నెలకొంది. జయపురం, వి.కొత్తపాలెం గ్రామాల్లో ఈ దుమ్ము, ధూళి ప్రభావంతో రహదారి వెంట గృహస్తులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ప్రయాణమంటే హడల్..

కోడూరు–అవనిగడ్డ రహదారిపై ప్రయాణించేందుకు వాహనచోదకులు హడలిపోతున్నారు. కేవలం వెట్ మిక్స్ మాత్రమే వేయడంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కంకర మొత్తం తొలగి భారీ గుంతలు ఏర్పాడ్డాయి. ఈ గుంతల రోడ్డులో వాహనాలను నడపాలంటే భయమేస్తోందని వాహనదారులు వాపోతున్నారు. గుంతల వల్ల వాహనాలు దెబ్బతినడంతో పాటు నడుము నొప్పి కూడా వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటి బారిన పడి వాహనదారులు ప్రమాదాలు బారిన పడుతున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. జయపురం–వి.కొత్తపాలెం గ్రామాల మధ్య నూతనంగా నిర్మిస్తున్న రహదారి అప్పుడే ధ్వంసమై ఆందోళనకరంగా మారింది. మార్జిన్ కుంగిపోయి రోడ్డు నెర్రలిచ్చి కాలువ వైపు కుంగిపోయింది. ఈ ప్రాంతంలో ఏ విధమైన హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి వేళల్లో ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని స్థానికులు అంటున్నారు.



బస్సు వెళ్లడంతో రహదారిపై లేచిన దుమ్ము, ధూళి



జయపురం–వి.కొత్తపాలెం మధ్య నెర్రలిచ్చిన రహదారి

100 రోజులైనా ప్రారంభం కాని పనులు..

ప్రభుత్వం అధికారంలోకి రాగానే రహదారి నిర్మాణం పూర్తి చేస్తామని అప్పటి కూటమి నేతలు హామీ ఇచ్చారు. గెలిచిన తర్వాత మొదటిగా చేపట్టేది కోడూరు–అవనిగడ్డ రహదారి నిర్మాణమేనని ఊకదంపుడు ఉపన్యాశాలిచ్చారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత రహదారి నిర్మాణాన్ని కూటమి ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని మండల ప్రజలు బాహాటంగానే మండిపడుతున్నారు.

భయమేస్తోంది..

కోడూరు–అవనిగడ్డ ప్రధాన రహదారిపై ప్రయాణించాలంటే భయమేస్తోంది. రహదారి గుంతలమయంగా మారడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. దుమ్ము, ధూళి వల్ల అనారోగ్య సమస్యలు కూడా ఎదురవుతున్నాయి. వెంటనే రహదారి నిర్మాణాన్ని పూర్తి చేయాలి.

– కడవకొల్లు సాంబశివరావు, మందపాకల

తీవ్ర ఇబ్బందులు

కోడూరు రహదారి నిర్మాణాన్ని మధ్యలోనే నిలిపివేశారు. కేవలం వెట్‌మిక్స్‌ను మాత్రమే వేసి వదిలేయడంతో దుమ్ము, ధూళితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. లారీలు, బస్సులు, టిప్పర్లు వెళ్లినప్పుడు వాటి వెనుక వెళ్లలేని పరిస్థితి. వాటరింగ్ కూడా చేయకపోవడంతో పరిస్థితి మరీ అధ్వానంగా మారింది.

– అప్పికట్ల చలపతిరావు, నక్కవానిదారి

ఉత్సాహంగా తాళం భజన పోటీలు



తాళం భజన పోటీల్లో పాల్గొన్న శ్రీకనకదుర్గ సీతారాంమాంజనేయ బాలభక్త భజన సమాజం

చిట్టూర్పు(ఘంటసాల): మండలంలోని చిట్టూర్పు గ్రామంలో వేంచేసియున్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల స్థాయి తాళం భజన, మురళీ కోలాటం పోటీలు నాలుగో రోజు ఆదివారం కోలాహలంగా సాగాయి. చిట్టూర్పునకు చెందిన శ్రీ కనకదుర్గ సీతారామాంజనేయ బాలభక్త భజన సమాజం, కొడాలికి చెందిన శ్రీ వేణుగోపాల భజన సమాజం, చినకళ్లేపల్లికి చెందిన శ్రీ లక్ష్మీ గణపతి భక్త సమాజం, బోల్లపాడుకు చెందిన శ్రీ సీతారామ భక్త సమాజం, పోలవరం గ్రామానికి చెందిన శ్రీ రామలింగేశ్వరీ భజన కళాకారుల సంఘం, శ్రీ శ్యామలాంబ మహిళా భజన సమాజం వారు పాల్గొని తమ ప్రతిభను కనబరిచారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా పడుగు ప్రభాకర్, ఏసుపాదం వ్యవహరించగా పాల్గొన్న భజన బృందాలకు ప్రశంసా పత్రం, మెమెంటో కమిటీ సభ్యులు అందించారు. పోటీల నిర్వహణ కమిటీ సభ్యుడు గుత్తికొండ వర ప్రసాద్ పాల్గొన్నారు.

అన్నపూర్ణాదేవికి వెండి కిరీటం సమర్పణ



అమ్మవారి వెండి కిరీటం, ఇతర ఆభరణాలతో దాతలు

భావదేవరపల్లి(నాగాయలంక): శ్రీఅన్నపూర్ణాదేవి సమేత శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలోని అమ్మవారికి దాతలు రూ.75వేలు విలువైన వెండి కిరీటం, వెండి కళ్లు, ముక్కుపుడక, బొట్టు సమర్పించారు. హైదరాబాద్‌లో స్థిరపడిన మండలంలోని పెదపాలెం గ్రామానికి చెందిన బీసాబత్తుని రత్నశేఖర్–ధాత్రీలక్ష్మి దంపతులు తన తండ్రి జగన్మోహనరావు జ్ఞాపకార్థం వీటిని బహూకరించారు. ఆలయ అర్చకుడు మోహనరావు అర్చకత్వంలో తొలుత విశ్వేశ్వరునికి అభిషేకాలు, అన్నపూర్ణాదేవికి విశేష పూజ జరిపారు. అనంతరం వెండి ఆభరణాలను ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పూషడపు నిరంజనరావు, శివసత్యవతి దంపతులు ద్వారా ఆలయ అర్చకుడికి అందించారు. పూషడపు సంధ్య, దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి తపాలా వారోత్సవాలు



జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ ఆదినారాయణ


మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం పోస్టల్ డివిజన్‌లో ఈ నెల 7 నుంచి 11వ తేదీ వరకు తపాలా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ కె. ఆదినారాయణ, అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ టి. నాగరాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 150 ఏళ్ల పోస్టల్ సేవలను గుర్తుచేస్తూ డివిజన్‌లో ఐదు రోజుల పాటు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. 7వ తేదీ సోమవారం మెయిల్స్, పార్సిల్ దినోత్సవం, 8న ఫిలాటెలీ దినోత్సవం, 9న ప్రపంచ తపాలా దినోత్సవం, 10న అంత్యోదయ దివస్, 11వ తేదీన విత్తీయ శశక్తికరణ్ దివస్ కార్యక్రమాలుంటాయన్నారు. ఈ సందర్భంగా ఆయా దివస్‌లపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు.



శ్రీరామపాదక్షేత్రంలో లలితాత్రిపుర సుందరీదేవి అలంకారంలో..



కొక్కిలిగడ్డలో లలితాత్రిపురసుందరీ దేవిగా దర్శనమిచ్చిన దుర్గమ్మ తల్లి



లలితాత్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చిన అద్దంకి నాంచారమ్మ



తరకటూరులో ధనలక్ష్మి అలంకారంలో అమ్మవారు



గూడూరు గాంధీబొమ్మ సెంటర్‌లో లలితాత్రిపురసుందరీదేవిగా..

శివానీ.. శిరసా నమామి

- లలితా త్రిపుర సుందరీదేవిగా పూజలందుకున్న అమ్మవారు
- వైభవంగా కొనసాగుతున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు



పెడన కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారి తీర్థపుబిందె ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

కోడూరు: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. నాలుగో రోజు ఆదివారం అమ్మవార్లు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. 'లోకపావని.. జగజ్జననీ దీవించు తల్లీ' అంటూ భక్తులు అమ్మవార్లకు పూజలు చేశారు. కృష్ణాతీరంలో భక్తుల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ అమ్మవారిని లలితా త్రిపుర సుందరీదేవిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. కోడూరు గంగాభవానీ, కనకదుర్గమ్మ అమ్మవార్లను కూడా లలితాదేవిగా అలంకరించారు. మహిళలచే సామూహిక కుంకుమార్చనను భక్తిప్రపత్తులతో జరిపారు. లింగారెడ్డిపాలెం బాలాత్రిపుర సుందరీదేవి, కోడూరు దానాశక్తి, పార్వతిదేవి, హంసలదీవి కాశీ అన్నపూర్ణాదేవి, మాచవరం తుంగపల్లెమ్మ అమ్మవారి ఆలయాల్లో నవరాత్రి ఉత్సవాలను కనుల పండువగా నిర్వహిస్తున్నారు.

బందరులో పలు ఆలయాల్లో..

మచిలీపట్నంటౌన్: నగరంలోని బలరామునిపేటలో వేంచేసియున్న శ్రీ అన్నపూర్ణా సహిత కాశీవిశ్వేశ్వర స్వామి వారి దేవస్థానంలో అమ్మవారు శ్రీ కాశీ అన్నపూర్ణా దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. నగరంలోని ఆజాద్‌రోడ్డులో ఉన్న గీతామందిరంలో కన్యకాపరమేశ్వరి అమ్మవారు శ్రీ లలితాత్రిపురసుందరీదేవిగా, లలితా అమ్మవారు శ్రీ ధైర్యలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. ఉదయం 149 మంది మహిళలు కుంకుమపూజలో పాల్గొన్నారు. బుట్టాయిపేటలోని దత్తాశ్రమంలో వారాహి అమ్మవారిని అలంకరించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు సంపూర్ణ భగవద్గీత పారాయణం చేశారు. నగరంలోని ఈడేపల్లి శక్తి గుడి, రాబర్ట్‌సన్‌పేటలోని రామలింగేశ్వరస్వామి ఆలయం, గొడుగుపేటలోని శివాలయం, గాంధీబొమ్మ శివాలయం, ఖొజ్జిల్లిపేట, చింతగుంటపాలెంలోని నాగేశ్వరస్వామి ఆలయాలు, రేవతి సెంటరులోని గంగానమ్మ ఆలయం, ప్రధాన రహదారిలోని విజయ దుర్గాదేవి, రాజుపేట ముచ్చం గుడి, పలు ఆలయాల్లో అమ్మవారిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. ఆయా ఆలయాల్లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

శ్రీ లలితాత్రిపురసుందరీదేవిగా..

ఘంటసాల: స్థానిక శ్రీ బాలపార్వతీ సమేత జలధీశ్వర స్వామి వారి ఆలయంలో దసరా నవరాత్రుల సందర్భంగా అమ్మ వారు శ్రీ లలితా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు ఆదివారం దర్శనమిచ్చారు.

నాలుగో రోజు పూజలు..

గూడూరు: మండలంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం నాలుగో రోజుకు చేరుకున్నాయి. గూడూరులోని శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయం, గాంధీబొమ్మ సెంటరులోని వినాయక మందిరాల్లో కొలువుదీరిన అమ్మవారు లలితా త్రిపుర సుందరీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తరకటూరులోని శ్రీ అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో ధనలక్ష్మీ దేవి అలంకారంలోను, గూడూరులోని మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ధాన్యలక్ష్మిగా దర్శమిచ్చారు.

భక్తితో పూజలు..

కొక్కిలిగడ్డ(మోపిదేవి): పెదకళ్లేపల్లి శ్రీ దుర్గా, పార్వతీ సమేత నాగేశ్వరస్వామివారి ఆలయం, కొక్కిలిగడ్డ శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామివారి ఆలయంలో దుర్గామాతను లలితాత్రిపుర సుందరీదేవిగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. పెదప్రోలు తూర్పు రామాలయం ఏర్పాటు చేసిన అమ్మవారికి చల్లపల్లి సీఐ ఈశ్వరావు దంపతులు అర్చకులచే వేద మంత్రాలుతో శాస్త్రోక్తంగా పూజలు చేశారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు..

బంటుమిల్లి: మండల పరిధిలో కొలువై ఉన్న దేవాలయాల్లో దేవీనవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సామూహిక కుంకుమ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇందులో భాగంగా బంటుమిల్లి కనకదుర్గా ఆలయం, పెద తుమ్మిడి శివాలయం, మల్లేశ్వరం, లక్ష్మీనారాయణపురం, పాశ్చాపురంలలోని ఆలయాల్లో అమ్మవార్లను శ్రీలలితాత్రిపురసుందరీదేవిగా అలంకరించి కుంకుమ పూజలు నిర్వహించారు. బంటుమిల్లి రామాలయం, వెంకటేశ్వరస్వామి దేవాలయంలో అమ్మవార్లను విజయలక్ష్మీదేవిగా అలంకరించి కుంకుమ పూజలు చేశారు. నాగేశ్వరరావుపేట, మల్లంపూడి, ముంజులూరు తదితర గ్రామాల్లో మందిరాలలో నిలిపిన అమ్మవారి ప్రతిమలు వద్ద భక్తులచే కుంకుమ పూజలు చేయించారు.

లలితాత్రిపుర సుందరీ దేవిగా వాసవీమాత..

పెడన: పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక శ్రీ వాసవి క్షేత్రమునందు వాసవీ మాతను శ్రీలలితా త్రిపురసుందరీ దేవిగా అలంకరించారు. వాసవి మండలి మహిళలు, సుహాసినిలు సాయంత్రం జ్యోతులను ఊరేగించారు. గ్రామదేవత పైడమ్మ అమ్మవారిని శ్రీలలితాత్రిపురసుందరీ దేవిగా అలంకరించారు. కొలవెన్ను దిలీప్‌కుమార్, ప్రసన్నలక్ష్మీ దంపతులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శ్రీసంతాన లక్ష్మిగా పార్వతీదేవి..

నాగాయలంక: స్థానిక ప్రసిద్ధ శ్రీపార్వతీ సమేత కన్యకాపరమేశ్వరీ సమన్విత శ్రీనగరేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం పార్వతీదేవి శ్రీసంతాన లక్ష్మీదేవిగా, శ్రీవాసవీ కన్యాకా పరమేశ్వరి శ్రీగాయత్రీదేవిగా భక్తులను అలరించారు. కృష్ణాతీరంలోని శ్రీకనకదుర్గమ్మ దేవస్థానంలో అమ్మవారు శ్రీలలితా త్రిపుర సుందరీ దేవి విశేష అలంకారంతో భక్తులకు దర్శనం ఇచ్చారు. గణపేశ్వరం దుర్గా, గణపేశ్వరస్వామి ఆలయాలలో నిలువెత్తు ఉండే దుర్గమ్మ మూలవిరాట్ ఆదివారం శ్రీఅన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్త మండల శ్రీరామచంద్రమూర్తి(రాంబాబు), అరుణ దంపతుల ఆధ్వర్యంలో ఆలయ అర్చకుడు పోతుకూచి సత్యనారాయణ విశేష పూజలు జరిపారు.

గాజుల అలంకరణలో..



కృత్తివెన్ను: మండల వ్యాప్తంగా శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. వివిధ గ్రామాలలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేస్తున్నారు. ఆదివారం నీలిపూడి గ్రామంలో శ్రీ లలితా త్రిపురసుందరీదేవిగా అమ్మవారిని ప్రత్యేకంగా గాజులతో చేసిన అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

కార్తికమాసానికి పక్కా ఏర్పాట్లు




పెడన: కార్తికమాసంలో స్వామి వారిని దర్శించుకోవడానికి విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని శ్రీ గంగాపార్వతీ సమేత అగస్త్యేశ్వరస్వామి, వేణుగోపాల స్వామి దేవస్థానాల అభివృద్ధి కమిటీ చైర్మన్ భళ్ల ప్రసాద్ అన్నారు. రానున్న కార్తిక మాసంలో చేపట్టాల్సిన పనులు, ఏర్పాట్లపై ఆలయంలో ఆదివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా కార్తిక మాసంలో నెల రోజుల పాటు స్వామి వారికి విశేష పూజలతో పాటు ప్రజలకు వలంటీర్ సేవలు కూడా అందించాలని అభివృద్ధి కమిటీ తీర్మానం చేసింది. దీక్షానందుడు, కట్టామూర్తి, సింగరాజు ప్రకాష్, శ్రీనివాస్ వీణం, మామిడి ప్రసాద్, పటమట బలరామ్ పాల్గొన్నారు.

ఊరేగింపుల్లో డీజేలకు అనుమతి లేదు



ఘంటసాల: దసరా నవరాత్రుల సందర్భంగా విగ్రహాల ఊరేగింపుల్లో డీజేలకు అనుమతులేవని చల్లపల్లి సీఐ కె.ఈశ్వరరావు అన్నారు. ఘంటసాల పోలీస్ స్టేషన్‌లో మండలంలోని నవరాత్రులు ఏర్పాటు చేసిన నిర్వాహకులు, సౌండ్ సిస్టం యజమానులతో ఆదివారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ఈశ్వరరావు మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు ఆదేశాల మేరకు అవనిగడ్డ డీఎస్పీ పి.మురళీధర్ పర్యవేక్షణలో మైక్ సిస్టం, విగ్రహ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించామన్నారు. నవరాత్రి ఉత్సవాల్లో అశ్లీల నృత్యాలకు, అసాంఘిక కార్యాకలాపాలకు, డీజే బాక్సులకు అనుమతి లేదన్నారు. మద్యం మత్తులో ఎలాంటి గొడవలు జరగకుండా కుల, మత రాజకీయాలకు అతీతంగా ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో దసరా ఉత్సవాలు జరుపుకోవాలని సీఐ ఈశ్వరరావు సూచించారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సహాయం



కోడూరు: అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన నక్కవానిదారి గ్రామానికి చెందిన పచ్చ వీరబాబు కుటుంబ సభ్యులకు గ్రామీణ యువజన వికాస సమితి అధ్యక్షుడు మండలి వెంకట్రామ్ (రాజా) ఆర్థిక సహాయం అందించారు. వీరబాబు కుటుంబసభ్యులను పరామర్శించి, ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు. గాయపడిన గేదెలకు చికిత్స అందుతున్న తీరును పరిశీలించారు. బాధిత కుటుంబానికి రూ.5వేలు నగదుతో పాటు నూతన దుస్తులను అందించారు. లింగారెడ్డిపాలెం గ్రామానికి చెందిన చిట్టిప్రోలు ఉత్తేజ్ బాధిత కుటుంబానికి రూ.5వేల విలువ చేసే నూతన దుస్తులు, నిత్యావసర సరకులు, బియ్యం, కూరగాయాలను అందించారు. అవనిగడ్డకు చెందిన బచ్చు నితిన్ బాధితుడు వీరబాబుకు రూ.7వేలు విలువ చేసే సైకిల్ అందించారు.



ఘంటసాల జలధీశ్వరుని ఆలయంలో లలితాత్రిపుర సుందరీ దేవిగా..



బంటుమిల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో విజయలక్ష్మిగా..



బందరులోని బలరామునిపేటలో కాశీ అన్నపూర్ణాదేవిగా అమ్మవారు



లలితాత్రిపుర సుందరీదేవి అలంకరణలో పెడన దావోజీపాలెం అమలేశ్వరి దేవి



నాగాయలంకలో కన్యకాంబ సన్నిధిలో సంతానలక్ష్మిగా..